క్లుప్తంగా

ప్రమాద బాధితుడికి పరామర్శ



ప్రమాదంలో గాయపడిన శోభనను పరామర్శిస్తున్న జెడ్పీటీసీ మత్స్యలింగం

హుకుంపేట: మండలంలోని గత్తు పంచాయతీ జిరుగుల పుట్టు గ్రామానికి చెందిన మజ్జి శోభన ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శోభనను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

వైఎస్సార్ బీమా అందజేత



వైఎస్సార్ బీమా నగదును అందజేస్తున్న సర్పంచ్ నాగమణి తదితరులు

ఎటపాక: ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ బీమా పేదల పాలిట వరమవుతుందని సర్పంచ్ పెనుబల్లి నాగమణి, సచివాలయ కన్వీనర్ గొల్లపల్లి శివబాబు అన్నారు. కన్నాయిగూడెం పంచాయతీ గట్టుగూడెం గ్రామానికి చెందిన పాయం ఆదిలక్ష్మి ఇటీవల మృతి చెందారు. ఆమె కుటుంబానికి తక్షణ సాయంగా రూ.10 వేల నగదును వారు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలకు సచివాలయ వ్యవస్థ ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. వైఎస్సార్ బీమాతో పేదలకు ఆసరాగా నిలుస్తోందన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్, కృష్ణవేణి, వలంటీర్లు సౌజన్య, రవిశేఖర్, నవీన్, వెంకట్ ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

అరకులోయటౌన్: అరకులోయ మండల జెడ్పీటీసీ శెట్టి రోషిణి భర్త కమిడి అశోక్‌కు అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పరామర్శించారు. అరకు ఏరియా ఆస్పత్రి సమీపంలో రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో అశోక్‌కు కుడి చెయ్యి విరిగింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యేతో పాటు నాయకులు, కార్యకర్తలు తన స్వగృహానికి వెళ్లి జరిగిన పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం చేయించుకోవాలని సూచించారు. అనంతరం అరకులోయ మండలంలోని యండపల్లివలస వద్ద గురువారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి జరిగిన ప్రమాదంలో ఎల్.బి.అభిషేక్(20) మృతి చెందినట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే పాల్గుణ అరకులోయ ఏరియా ఆస్పత్రి వద్దకు వెళ్లి మృతుడి తల్లిదండ్రులకు ఓదార్చి, పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఎంపీటీసీలు ఆనంద్, భీమరాజు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్ తదితరులున్నారు.

పాఠశాలలో క్రీడా పోటీలు ప్రారంభం

అరకులోయటౌన్: మండల కేంద్రంలోని కంఠబౌంషుగుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. రన్నింగ్, కబడ్డీ, లాంగ్ జంప్, ఖోఖో, క్రికెట్ పోటీలు అట్టహాసంగా జరిగాయి. పీడీ పాంగి సూరిబాబు ఆధ్వర్యంలో జరిగిన క్రీడా పోటీల కార్యక్రమం హెచ్ఎం టి.మోహనరావు పర్యవేక్షించారు. ఉపాధ్యాయులు పెద్దన్న, ఎరుకులు, పరమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

శారీరక, మానసిక ఆరోగ్యంతో ఆనందం

అనకాపల్లిటౌన్: నేటి సమాజంలో వ్యక్తిగత శ్రేయస్సుకు శారీరక, మానసిక ఆరోగ్యం ఆవశ్యకతను ప్రతి వ్యక్తి తెలుసుకోవాలని ఆధ్యాత్మిక, యోగా గురువు కె.శ్రావణ్‌కుమార్ సూచించారు. స్థానిక డైట్ కళాశాల ఆవరణలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్(జీ20), రాజయోగ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం మానసిక ఆరోగ్యం-శ్రేయస్సు అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ శారీరక ఆరోగ్యం, మానసిక శ్రేయస్సు మధ్య సంక్లిష్ట సంబంధానికి గల వ్యత్యాసాలను వివరించారు. ఆరోగ్యకరమైన శరీరం, ఆరోగ్యకరమైన మనసుకు దోహదపడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు మాట్లాడుతూ సమతుల్య విధానాలను పాటించడం ద్వారా సమాజంలో ఆరోగ్యంగా, సంతోషంగా జీవించవచ్చన్నారు. మానసిక ఒత్తిళ్లను ధైర్యంగా ఎదుర్కొనేందుకు ఇలాంటి సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అకడమిక్స్ డీన్ కె.పార్వతి, డీఎల్‌సీసీ కో ఆర్డినేటర్ మైత్రి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగు..లాభాలు బాగు

- ఆశాజనకంగా ధరలు
- పెరుగుతున్న విస్తీర్ణం
- కలిసొచ్చిన రైతు భరోసా సొమ్ము
- ఆనందంలో గిరిజన రైతులు



వనుగుపుట్టులో మొక్కజొన్న పంట

ముంచంగిపుట్టు: ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా మొక్కజొన్న సాగు జోరందుకుంది. మన్యంలో సేంద్రియ పద్ధతిలో పండించే మొక్కజొన్నకు మైదాన ప్రాంతాల్లో మంచి గిరాకీ ఉంది. దీంతో ఏటా ఎక్కువ విస్తీర్ణంలో మొక్కజొన్నను గిరిజన రైతులు పండిస్తున్నారు. మండలంలోని 23 పంచాయతీల్లో 376 గ్రామాల్లో మొక్కజొన్న సాగు విస్తారంగా గిరిజనులు చేపడుతున్నారు. గత ఏడాది మొక్కజొన్న దిగుబడి అధికంగా ఉండడం, లాభాలు రావడంతో ఈ ఏడాది మొక్కజొన్న సాగుపై గిరిజనులు అధిక దృష్టి పెట్టారు. ప్రతి గ్రామంలోను ఇళ్లకు సమీపంలో మొక్కజొన్న పంటను గిరిజనులు అధికంగా వేశారు. ముంచంగిపుట్టు మండలంలో180 ఎకరాల్లో మొక్కజొన్న పంటను గిరిజన రైతులు సాగు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతానికి మొక్కజొన్న దిగుబడి బాగా ఉందని గత ఏడాది ఒక మొక్కజొన్న రూ.10 ధర పలికిందని, దీంతో సాగు విస్తీర్ణం పెంచినట్టు పెంచామని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద రైతు భరోసా సొమ్ము అందించడం మొక్కజొన్న పంటకు ఎంతో ఉపయోగపడిందంటున్నారు. గతంలో అప్పులు చేసి పంటను వేసే వాళ్లమని సాగు దిగుబడి తగ్గితే అప్పులు చెల్లించేందుకు పడరాని పాట్లు పడేవారమని ఈ ఏడాది ఆ సమస్య లేదని గిరిజన రైతులు తెలిపారు.

వారపు సంతల్లో జోరుగా వ్యాపారం

ముంచంగిపుట్టు మండల కేంద్రంతో పాటు జోలాపుట్టు, భూసిపుట్టు, లక్ష్మీపురం, బంగారుమెట్ట పంచాయతీ కేంద్రాల్లో జరిగే వారపు సంతల్లో మొక్కజొన్న వ్యాపారం అధికంగా జరుగుతుంది. ఏటా ఆగస్టు నెల నుంచి డిసెంబర్ వరకు అధికంగా మొక్కజొన్నను ఆంధ్ర, ఒడిశా సరిహద్దు గిరిజన గ్రామాల నుంచి గిరిజన రైతులు వారపు సంతలకు తీసుకొని వస్తారు. వీటిని కొనుగోలు చేసేందుకు విశాఖ, విజయనగరం, అనకాపల్లి జిల్లాలతో పాటు ఒడిశా రాష్ట్రం లంతాపుట్టు, జైపూర్, కొరాపుట్టు ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి ఆటోలు, వ్యాన్‌లలో లోడ్ చేసుకుని తీసుకుని వెళ్తున్నారు. దీంతో మొక్కజొన్న వ్యాపారం సంతల్లో మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది. వ్యాపారం బాగుండడంతో గిట్టుబాటు ధరలు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు.

వ్యాపారం బాగుంది

మొక్కజొన్న వ్యాపారం గత కొన్ని సంవత్సరాల నుంచి బాగుంది. ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల నుంచి అధికంగా మొక్కజొన్నను కొనుగోలు చేస్తున్నారు. మంచి ధర సైతం పలుకుంది. దీంతో మొక్కజొన్న సాగును విస్తరించాం. జూన్, జూలై నెలలో మొక్కజొన్న పంటను వేసి ఆగస్టు నెల నుంచి అమ్మకాలు చేస్తున్నాం. ప్రభుత్వం రైతు భరోసా సొమ్ము అందించడంతో లాభాలు వచ్చే పంటలు పండించేందుకు పెట్టుబడి సాయంగా ఉపయోగ పడుతుంది.

– వి.లోకనాథ్, రైతు, వనుగుపుట్టు గ్రామం, ముంచంగిపుట్టు మండలం

రైతులకు సూచనలు

గిరిజన రైతులకు మార్కెట్‌లో డిమాండ్ ఉండే పంటలపై దృష్టి పెట్టాలని సూచనలు చేస్తున్నాం. గత కొన్ని సంవత్సరాలు మొక్కజొన్నకు వారపు సంతల్లో డిమాండ్ నెలకొంది. దీంతో రైతులు గ్రామాల్లో మొక్కజొన్న సాగుపై పూర్తిగా దృష్టి సారించారు. దీంతో గ్రామాల్లో సిబ్బందితో మొక్కజొన్న సాగు సంరక్షణ, దిగుబడిపై అవగాహన కల్పిస్తున్నాం. రైతులు సైతం సూచనలు, సలహాలు పాటిస్తూ సాగు చేస్తూ దిగుబడిని సాధిస్తున్నారు.లాభాలు పొందుతున్నారు.

– ఎం.శ్రీనివాస్‌బాబు, ఏవో, ముంచంగిపుట్టు

పోస్టాఫీసుల్లో జాతీయ జెండాల విక్రయాలు



జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయటౌన్: మండలంలోని సబ్ పోస్టాఫీసులో జాతీయ జెండాలు విక్రయానికి అందుబాటులో ఉన్నాయి. ఈ సందర్భంగా అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ గురువారం పోస్టాఫీసులో జాతీయ జెండాను ప్రదర్శించారు. ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ ప్రజలందరూ సమీపంలోని పోస్టాఫీసులకు వెళ్లి జాతీయ జెండాలు కొనుగోలు చేసుకొని, స్వాతంత్ర్య వేడుకను ఘనంగా జరుపుకోవాలని కోరారు. ప్రతీ మారుమూల ప్రాంత ప్రజలు పోస్టాఫీసు సేవలు ఉపయోగించుకోవాలన్నారు. అరకులోయ బ్రాంచ్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని అరకులోయ పోస్టాఫీసులో రెండువేల జాతీయ జెండాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, వీటిని అరకులోయ, డుంబ్రిగుడ, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలకు చెందిన పోస్టాఫీసుల్లో విక్రయానికి జాతీయ జెండాలను అందుబాటులో ఉంచుతామన్నారు. ఒక్కో జెండా రూ.25లకు విక్రయిస్తున్నామన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్, టెలికమ్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు శెట్టి వెంకటరావు, నాయకులు సాంబ, చలపతిరావు, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

బడిబయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

చింతూరు: బడిబయట ఉంటున్న పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో వెంకటరత్నం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు తమ పరిధిలో ఉన్న పాఠశాలలను సందర్శించి బడిబయట ఉన్న పిల్లల జాబితాను సేకరించాలని, వారి తల్లిదండ్రులను కలిసి చిన్నారులను పాఠశాలల్లో చేర్పేలా ఒప్పించాలన్నారు. మండలంలోని చిడుమూరు, చట్టి, ఏడుగురాళ్లపల్లి, మోతుగూడెం సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తున్నామని, ఆయా ప్రాంతవాసులు కేంద్రం సేవలను వినియోగించు కోవాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వీఆర్‌వోలు సచివాలయాల్లో ఖచ్చితంగా హాజరై మండల పరిషత్ కార్యాలయం ద్వారా కలెక్టర్‌కు హాజరు వివరాలు సమర్పించాలని ఎంపీడీవో ఆదేశించారు.

నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ



కొయ్యూరులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు, ఉపాధ్యాయులు



అరకులోయలో మాత్రలను మింగిస్తున్న వైద్య సిబ్బంది

కొయ్యూరు: ప్రతీ విద్యార్థి నులిపురుగు నివారణకు అల్బెండజల్ మాత్రాలు వేసుకోవాలని రాజేంద్రపాలెం వైద్యుడు సంపత్‌బాబు సూచించారు. ఆయన గురువారం బాలుర ఆశ్రమ పాఠశాల-2ను సందర్శించారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఆయన సూచించారు. వాతావరణంలో మార్పుల కారణంగా వేడి నీటిని తాగాలన్నారు. సీహెచ్‌వో ప్రశాంత్, హెచ్ఎం బాలమురళీకృష్ణ పాల్గొన్నారు

అరకులోయటౌన్: మండలంలోని రవ్వలగుడ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు నులిపురుగుల మాత్రలను మింగించారు. అల్బెండజోల్ మాత్రలు పిల్లలకు, పెద్దలకు సురక్షితమైనవి, అంగన్‌వాడీ, పాఠశాలలో, కళాశాలల్లో అందుబాటులో ఉన్నాయని ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విశ్వేశ్వరనాయుడు తెలిపారు. డాక్టర్ ఎస్.వి నీల, హెచ్ఎం కెందు, చిన్న, పావని పాల్గొన్నారు.



అనంతగిరిలో మాట్లాడుతున్న జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి అప్పలరాము

అనంతగిరి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు జిల్లా వృత్తివిద్యాశాఖ అధికారి అప్పలరాము అల్బెండాజోల్ మాత్రలను వేశారు. నులిపురుగుల నివారణ సామాజిక బాధ్యతగా గుర్తించి, అల్బెండాజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ అనిల్, వైద్యాధికారి జ్ఞానేశ్వరీ, లైబ్రేరియన్ రమణ తదితరులు పాల్గొన్నారు.

వరినారు శుద్ధికి బీజామృతం మేలు



వరి నారును శుద్ధి విధానాన్ని రైతులకు వివరిస్తున్న సీఆర్పీ అప్పలరాజు

రాజవొమ్మంగి: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో భాగంగా నాట్లు వేసేందుకు ముందు వరి నారును బీజామృతంతో శుద్ధి చేసుకొంటే భూములో నుంచి సంక్రమించే వేరు కుళ్లు, వేరు కాయ తదితర తెగుళ్ల నుంచి పంటను కాపాడుకోవచ్చని సీఆర్పీ అప్పలరాజు రైతులకు అవగాహన కల్పించారు. రైతు సాధికార సంస్థ, ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్ట్ కార్యక్రమాల్లో భాగంగా ఉర్లాకులపాడులో ఆయన రైతులకు పలు అంశాలను గురువారం వివరించారు. ఇందులో భాగంగా బీజామృతం తయారీ కోసం 20 లీటర్ల నీరు, 5 లీటర్ల దేశవాళి ఆవు మూత్రం, 5 కిలోల పేడ, గుప్పెడు పుట్ట మన్ను, 50 గ్రాములు సున్నం అవసరమన్నారు. వీటితో రైతుల సమక్షంలో బీజామృతం చేసి ఏ విధంగా ఉపయోగించాలో వివరించారు. రైతులు కోసూరి తమ్మిరెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



కార్యక్రమంలో పాల్గొన్న యూటీఎఫ్ నేతలు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలో యూటీఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత నాయకులు జెండాను ఆవిష్కరించారు. నాయకులు పైడిమల్లు, రమణ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే యూటీఎఫ్ లక్ష్యమన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ ఉదయ్, హెచ్ఎం గోపాలకృష్ణ, వెంకటస్వామి, బొజ్జయ్య, సుబ్బారావు, ప్రసన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత



కొయ్యూరులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రమేష్, అధికారులు



అనంతగిరిలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి, జెడ్పీటీసీ గంగరాజు తదితరులు



దేవీపట్నంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ మురళీ, జెడ్పీటీసీ సత్యవేణి తదితరులు

కొయ్యూరు: మండలంలోని రాజేంద్రపాలెంలోని అల్లూరి స్మారక పార్కులో నా మట్టి- నా దేశం కార్యక్రమంలో భాగంగా శిలాఫలకాన్ని ఎంపీపీ బడుగు రమేష్‌బాబు తదితరులు ఆవిష్కరించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, చింతపల్లి ఏఎంసీ చైర్‌పర్సన్ రాజులమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, నాయకులు సత్యనారాయణ, వెంకటరమణ, ఎంపీడీవో లాలం సీతయ్య, తహసీల్దార్ తిరుమలరావు, జేతు రామకృష్ణ, ఈవోఆర్‌డీ నాయుడు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని చిట్టింపాడు, గదబపాలెంలో జరిగిన నా మట్టి – నా దేశం కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, ఎంపీటీసీ సభ్యుడు బి.అప్పారావు, సర్పంచ్ నూకాలమ్మ తదితరులు మొక్కలు నాటారు.

అనంతగిరి: నా మట్టి- నా దేశంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి నీలవేణి, జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు మొక్కలు నాటారు. సర్పంచ్ రూతు, కో–ఆప్షన్ సభ్యుడు మదీనా, ఎంపీడీవో కుమార్, ఏపీవో అర్జున్, ఈసీ పవన్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు అప్పారావు, వైద్యాధికారి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం: నా మట్టి- నా దేశం కార్యక్రమంలో భాగంగా గురువారం ఇందుకూరుపేటలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కుంజం మురళీ, జెడ్పీటీసీ సభ్యురాలు సత్యవేణి తదితరులు పోతురెడ్డివారి చెరువు గట్టుపై అమరవీరులను స్మరిస్తూ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.ఎంపీడీవో కె.రత్నకుమారి, సర్పంచ్ కారం కృష్ణబాబు, నాయకులు బాబ్జి , సత్యనారాయణ, మురళీకృష్ణ, శివరామకృష్ణ, గోపి, ఏపీవో చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

రమణయ్య మృతి పార్టీకి తీరని లోటు



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి

గంగవరం: వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, పార్టీ యువజన విభాగ అధ్యక్షుడు ఇరాట రమణయ్య సంస్మరణ కార్యక్రమం లొద్దిపాలెంలో గురువారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ రమణయ్య మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. పార్టీ బలోపేతం కోసం ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. మృతుడి కుటుంబసభ్యులను ఆమె పరామర్శించారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ, బేబీరత్నం, వైస్ ఎంపీపీ రామతులసి, గంగాదేవి తదితరులున్నారు.

ఆదివాసీ గ్రామాల్లో సర్వే వేగవంతం



మాట్లాడుతున్న ఎంపీడీవో పూర్ణయ్య, తహసీల్దార్ కృష్ణారావు తదితరులు

పెదబయలు: కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రధానమంత్రి ఆది ఆదర్శ గ్రామీణ యోజన పథకంలో భాగంగా ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే వేగవంతం చేయాలని స్థానిక ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య, తహసీల్దార్ కృష్ణారావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు.గ్రామ రెవెన్యూ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సర్వే నిమిత్తం మండలంలో 12 ఆదివాసీ గ్రామాలను ఎంపిక చేశారన్నారు. ఆయా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా తాగునీటి సదుపాయం, పాఠశాల, అంగన్‌వాడీ భవనాల మరమ్మతులు, మురుగు కాలువలు, సీసీ రోడ్లు, విద్యుత్ సదుపాయం తదితర అవసరాలు గుర్తించాలన్నారు. ఈ మేరకు ప్రతీ గ్రామానికి రూ. 20.38 లక్షలకు తగ్గకుండా ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు సర్వేను నిర్వహించి ప్రతిపాదనలు గ్రామసభలో తీర్మానం చేసి ఆమోదం చేసిన తరువాత ఎంపీడీవో కార్యాలయానికి సమర్పించాలని కోరారు. మండలంలో ప్రధాన మంత్రి పీవీటీసీ మిషన్ ప్రాజెక్టు ద్వారా 161 ఆదిమ జాతి గిరిజనులున్నారని, వారి జీవన స్థితిగతులు, మౌలిక సదుపాయాలపై వివరాలను సేకరించి, యాప్ ద్వారా ఈ నెల 15 తేదీలోగా కార్యాలయానికి అందజేయాలని సూచించారు. ఆయా కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈవోపీఆర్‌డి నర్సింగరావు, ఏఈలు రాముడు, ఖురేష్, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశాల్లో వెల్లువెత్తిన సమస్యలు



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు



గంగవరంలో మాట్లాడుతున్న ఎంపీపీ కృష్ణారెడ్డి

రంపచోడవరం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బందం శ్రీదేవి అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు కొమ్మిశెట్టి బాలకృష్ణ, పండా కుమారీలు హాజరయ్యారు. పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకోవచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీదేవి మాట్లాడుతూ సమావేశాలకు పూర్తిస్థాయిలో అధికారులు హాజరుకావాలన్నారు. మురుసుమిల్లి ఎంపీటీసీ వంశీ మాట్లాడుతూ అక్రమంగా విలువైన కలప తరలిపోతోందని, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. నరసాపురం పీహెచ్‌సీ వైద్యుడు సమావేశానికి ఇప్పటి వరకు హాజరు కాలేదని, అతనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. లక్ష్మి, మంగమ్మ, సర్పంచ్‌లు తదితరుల పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి సాధ్యం

గంగవరం: అధికారులు, ప్రజాప్రతినిధులు స్వయంతో పనిచేస్తూ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కృష్ణారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండలంలోని పలు సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మండల పరిషత్ సమావేశాలకు అధికారులు పూర్తిస్థాయిలో హాజరుకావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న సమావేశాలకు అధికారులందరూ పూర్తిస్థాయిలో హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం మాట్లాడుతూ మండలంలోని రహదారుల అభివృద్ధికి జిల్లా పరిషత్ నుంచి రూ.60లక్షల నిధులు మంజూరైనట్టు చెప్పారు. ఎంపీడీవో శ్రీనివాసులు, ఏవో విశ్వనాథ్, వైస్ ఎంపీపీ రామతులసి, గంగాదేవి, కో–ఆప్షన్ సభ్యుడు ప్రభాకర్ రావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రామాల్లో ఎమ్మెల్యేల పర్యటన

జి.మాడుగుల: మండలంలో పాలమామిడి పంచాయతీలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని శుక్రవారం ఉదయం 10.30 గంటలకు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సుర్ల మత్స్యకొండంనాయుడు తెలిపారు. అనంతరం మండలంలోని సొలభం-2 పంచాయతీలోని గొందిపాడు సచివాలయ భవనాన్ని మధ్యాహ్నం 12గంటలకు, వంజరిలోని రైతు భరోసా కేంద్రాన్ని ఒంటి గంటకు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం 2గంటలకు మండలంలో గెమ్మెలి పంచాయతీ కేంద్రంలో, గెమ్మెలి కొత్తూరు గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

దేవీపట్నం: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి శుక్రవారం మండలంలో పర్యటించనున్నట్టు ఎంపీపీ కుంజం మురళీ తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు డి.రావిలంక, బోడిగూడెం, పరగసానిపాడు గ్రామాల్లోని ఆర్అండ్ఆర్ కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, తప్పక హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజవొమ్మంగి: ట్రీ కటింగ్, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడుతున్న నేపథ్యంలో మండలంలోని 11 కేవీ, జడ్డంగి ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ సురేష్‌కుమార్ తెలిపారు. ఈ కారణంగా చెరకుంపాలెం, మారేడుబాక పంచాయతీల్లోని సంజీవనగరం, బోర్నగూడెం, మర్రిపాలెం, వెలగలపాలెం, ఉర్లాకులపాడు, జి.శరభవరం గ్రామాలకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలి

అరకులోయటౌన్: గిరిజన ప్రాంతంలోని 11 మండలాల్లోని 244 గ్రామ పంచాయతీల పరిధిలోని పీవీటీజీలకు అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పొద్దు బాలదేవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీవీటీజీలకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయించాలన్నారు. 244 గ్రామ పంచాయతీల్లో 1664 గ్రామాల్లో సుమారు లక్ష 75 వేల మంది పీవీటీజీలున్నారన్నారు. పలువురికి రద్దు చేసిన అంత్యోదయ కార్డులను పునరుద్ధరించాలని కోరారు. రామన్న, అప్పలరాజు, అప్పన్న, నగేష్ తదితరులు పాల్గొన్నారు.